## రోడ్డు వేయించి..బురద కష్టాలు తొలగించి..



వారం క్రితం బురదమయంగా రోడ్డు



ప్రస్తుతం వెట్ మిక్సర్ కంకరతో వేసిన రోడ్డు

రామకృష్ణాపూర్, జూలై 20: క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీసు రోడ్డు వర్షం పడి బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ గత వారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన వారం రోజుల్లో రోడ్డును బాగుచేయిస్తానని ప్రజలకు మాట ఇచ్చారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్వోబీ సర్వీసు రోడ్డుపై వెట్ మిక్సర్ కంకర 400 మీటర్ల మేర వేయించి బాగు చేశారు. వారం క్రితం వర్షంతో బురమయమైంది. నేడు వెట్ మిక్సర్ కంకర వేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మొక్కలు నాటడం అందరి బాధ్యత

మందమర్రి, జూలై 20: హరితహారంలో భాగంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మొక్కలను ప్రతి ఇంటి ఆవరణలో నాటాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు విద్యానగర్‌లో గురువారం మున్సిపల్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఇండ్లతో పాటు పరిసరాల్లో ఖాళీ స్థలాల్లో నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రఘురాం, మున్సిపల్ సిబ్బంది నరహరి, గోపీ, ఆర్పీలు తీగల అరుణ, బత్తిని జ్యోతి, బీఆర్ఎస్ నాయకులు రాగిడి రాంరెడ్డి, కొట్టె కొమురయ్య, నార లింగయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మందమర్రిలో మొక్కలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ వాసుదేవరావు

చెన్నూర్ రూరల్, జూలై 20: చెన్నూర్ మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ సీఐ వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీద ఎడతెరిపి లేని వానతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. పిల్లలను వాగులు, చెరువులు, అన్నారం బ్యారెజ్ వైపు వెళ్లనీయద్దని సూచించారు. గోదావరి తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

## అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దు

మందమర్రి, జూలై 20: గృహాలు, వ్యాపార సముదాయాలకు, ట్రేడ్ లైసెన్సుల కోసం పన్ను చెల్లించాలని ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే పన్నులు చెల్లించవద్దని మందమర్రి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు అపరిచిత వ్యక్తులు పన్నులు చెల్లించాలని పట్టణ వాసులకు ఫోన్ చేస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిని నమ్మవద్దన్నారు. వార్డులకు వచ్చే బిల్ కలెక్టర్, లేదా మీ సేవా కేంద్రం, నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పన్నులు చెల్లించాలని సూచించారు.

## చెన్నూర్‌లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు

చెన్నూర్, జూలై 20: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణంలో పలు వార్డుల్లో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. మురుగుకాలువల్లో పూడికను తీశారు. రోడ్లపై ఉన్న చెత్త, ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. బ్లీచింగ్ ఫౌడర్ చల్లి క్లోరినేషన్ చేశారు. చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డుకు తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జీ గంగాధర్ ప్రజలను కోరారు.

## కొనసాగుతున్న భాగవత సప్తాహం



ప్రవచిస్తున్న మల్లాది వెంకట రామనాథ శర్మ

చెన్నూర్ టౌన్, జూలై 20 : చెన్నూర్ పట్టణంలో శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన జ్ఞాన మహా యజ్ఞం కొనసాగుతున్నది. స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో ప్రవచన శేఖర బ్రహ్మశ్రీ మల్లాది వెంకట రామనాథ శర్మ భాగవత సప్తాహం ప్రవచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు కృష్ణుడి లీలలపై వివరించారు. భక్తుల కోసం మధ్యాహ్నం అల్పాహారం, సాయంత్రం ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మెర రాజేశ్వర్ రావు, కేవీఎం శ్రీనివాస్, రేగళ్ల భూషణ్ శర్మ, మల్లప్ప సురేశ్ శర్మ, కసోజ్జల భాస్కర్ శర్మ, కోటిచింతల దిగంబర్, సూసర్ల సురేశ్, శ్రీరాంభట్ల మురళి, పురాణపు శంకర్, పులి శంకర్, మారెపల్లి రామ్మూర్తి, పొట్లాల సుధీర్, మారుపాక రామన్న, వేదాంతం కృష్ణమూర్తి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# చదరంగంతో ఆలోచన శక్తి పెంపొందుతుంది

- మంచిర్యాల జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి

మందమర్రి, జూలై 20: విద్యార్థులలో ఆలోచన శక్తిని పెంపొందించేందుకు చదరంగం క్రీడ దోహదపడుతుందని మంచిర్యాల జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అన్నారు. మందమర్రి పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రపంచ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి చదరంగం పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదరంగంపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. మేధస్సుకు పదును పెట్టేదే చదరంగం క్రీడ అని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. చదరంగం క్రీడలో విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల నిర్వాహకులు జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలును శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీరాజ్ ఉర్ రెహమన్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వజీర్ సుల్తాన్, చెస్ అసోసియేషన్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, లిటిల్ ఫ్లవర్ పాఠశాల చైర్మన్ సిద్ధయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి, పీఈటీలు కుమార్, సుజన్, చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## హోటళ్లలో తనిఖీ



జరిమానా రసీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

చెన్నూర్, జూలై 20: చెన్నూర్ పట్టణంలోని పలు హోటళ్లలో మున్సిపాలిటీ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని సితార గ్రాండ్ హోటల్‌లో తనిఖీ చేయగా మాంసాహార పదార్థాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచినట్టు బయటపడింది. దీంతో మున్సిపాలిటీ అధికారులు సీతార గ్రాండ్ యజమానికి రూ 8,000 జరిమానాను మున్సిపల్ కమిషనర్ జీ గంగాధర్ విధించారు. హోటళ్లల్లో నిల్వ చేసిన ఆహార పదార్థాలను వాడవద్దని, తగు పరిశుభ్రత పాటించాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పీ హరికాంత్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలి




మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరవిందరావు

జైపూర్, జూలై 20: రైతులకు మూడు గంటల కరెంటు చాలని మాట్లాడిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని జైపూర్ మండల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందరావు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గుండు తిరుపతి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



బాధితునికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ బీ అశోక్

రామకృష్ణాపూర్, జూలై 20: మందమర్రి మండలానికి చెందిన సింగరేణి కార్మికుడు నీలవేణి శంకరయ్య పోగొట్టుకున్న మొబైల్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనిపెట్టి రామకృష్ణాపూర్ ఎస్ఐ చేతుల మీదుగా గురువారం బాధితుడికి మొబైల్‌ను అందజేశారు. జూన్ 6న విధులకు వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో సెల్ ఫోన్ ఎక్కడో పడిపోయింది. వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించి శంకరయ్యకు మొబైల్ ఫోన్‌ను గురువారం ఎస్ఐ బీ. అశోక్ అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బీ. అశోక్, సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ కానిస్టేబుల్ ఓంకార్ ఉన్నారు.

## పీఎంఎస్‌బీవై బీమా చెక్కు అందజేత

రామకృష్ణాపూర్, జూలై 20: రామకృష్ణాపూర్ యూనియన్ బ్యాంక్ ఖాతాదారుడు మామిడాల లక్ష్మయ్య కుటుంబానికి పీఎంఎస్‌బీవై బీమా చెక్కును క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ జి. వెంకటనారాయణ చేతుల మీదుగా గురువారం అందజేశారు. గతేడాది అక్టోబర్‌లో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మామిడాల లక్ష్మయ్య ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. పీఎంఎస్‌బీవై కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అతని కుమారుడు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సంతోష్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి అధికారి ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

మందమర్రి, జూలై 20: మందమర్రి పట్టణంలోని ఒకటవ జోన్ ఏరియాలో గల వేంకటేశ్వర ఆలయ సమీపంలో నివాసముండే సింగరేణి అధికారి విజయ్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. సింగరేణి సిమ్ టార్చ్‌లో పని చేస్తున్న విజయ్‌కుమార్ తన భార్యతో కలిసి బుధవారం ఉదయం గోదావరిఖనికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాను తెరిచి అందులో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గురువారం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని మందమర్రి ఎస్ఐ చంద్రకుమార్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ బృందంతో ఆధారాలను సేకరించారు. నిత్యం రద్దీగా ఉండే కోల్‌బెల్ట్ రహదారి పక్కన పట్టపగులు చోరీ జరగడం సంచలనం సృష్టించింది. గురువారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మాదాపూర్‌లో ఘనంగా మడేలయ్య బోనాలు

దండేపల్లి, జూలై 20 :దండేపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్య బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు.అనంతరం మేకలు, కోళ్లు బలి ఇచ్చి విందు భోజనాలు ఆరగించారు.ఈ కార్యక్రమంలో రజకసంఘం సభ్యులు ఉన్నారు.